## ఐటీ అండ.. ఫార్మా దెబ్బ.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

మొదటిపేజీ తరువాయి - మొగ్గు చూపడంతో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 251.89 పాయింట్లు (0.34%) నష్టపోయి 72,781.89 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 99.25 పాయింట్లు (0.44%) క్షీణించి 22,622.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కీలకమైన 22,650 స్థాయికి దిగువన ముగియడం గమనార్హం. సెన్సెక్స్ 30 షేర్లలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ వంటివి ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయి సూచీపై ఒత్తిడి పెంచాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఫైనాన్స్ టాప్ లూజర్లుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. అయితే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ లాభాలతో ముగిసి మార్కెట్లకు కొంత అండగా నిలిచింది. ప్రధాన సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.32% మేర నష్టపోయాయి.

## జర్నలిస్టుల నిర్బంధంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంఘం

మొదటిపేజీ తరువాయి - ఆశ్రయించిన మీడియా సంఘం! ఢిల్లీలో జర్నలిస్టులపై పోలీసుల చర్యలను సవాల్ చేస్తూ పిటిషన్ ఢిల్లీలో నిరసన కార్యక్రమాలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను నిర్బంధించడం, భౌతికంగా బలవంతంగా అదుపులోకి తీసుకోవడం, అక్కడి నుంచి బలవంతంగా తరలించడం వంటి చర్యలు రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తున్నాయని ఆరోపిస్తూ నెట్‌వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా, ఇండియా (చీజీవీ×) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద పిటిషన్ దాఖలు చేసింది. జర్నలిస్టులపై పోలీసుల చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)(ఴ), 19(1)(ఽ), 21లను ఉల్లంఘిస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొంది. స్వతంత్రంగా వార్తలు సేకరించే జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరింది. సీనియర్ జర్నలిస్టు పరంజోయ్ గుహా ఠాకుర్తా అక్టోబర్ 10న తన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ూ×దీ) గుర్తింపు కార్డును చూపించినప్పటికీ పోలీసులు తనను అదుపులోకి తీసుకున్నారని పిటిషన్‌లో ప్రస్తావించారు. తన నిర్బంధానికి గల కారణాలు తెలియజేయలేదని, సంబంధిత పత్రాలు కూడా అందించలేదని ఆయన పేర్కొన్నట్లు వివరించారు. మరోవైపు, ఢిల్లీలో రెండు రోజుల వ్యవధిలో కనీసం 35 మంది జర్నలిస్టులను నిర్బంధించినట్లు కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (జ్రూజీ) నివేదికను కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. నిరసనల సమయంలో వార్తా సేకరణ చేసే జర్నలిస్టుల హక్కులను పరిరక్షించేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని మీడియా సంఘం కోరింది.

## రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం సింగరేణి సంస్థను పంచుకొని దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) ఆరోపించారు. సింగరేణిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని, ఆయన పాలనలో సంస్థ భ్రష్టుపట్టిపోతోందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో అక్టోబర్ 14న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన ప్రసంగించారు. కమిషన్ల లెక్కలు తేలకపోవడం వల్లే నైని టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. నైని కుంభకోణాన్ని ఆపి రూ.30,000 కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పెద్దల మధ్య వాటాలు తేలనప్పుడే ఇలాంటి కుంభకోణాలు బయటకు వస్తాయని ఎద్దేవా చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధన పేరుతో సింగరేణిలో సుమారు రూ.10,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. దీనితో పాటు సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లు, మరో నాలుగైదు అంశాల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. సింగరేణి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటికే సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికార పార్టీ నేతలు ఒకరినొకరు కాపాడుకుంటూ, కమిషన్ల కోసం సింగరేణిని కొల్లగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## సర్ పై సుప్రీంకోర్టులో ఒవైసీ పిటిషన్

మొదటిపేజీ తరువాయి - సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఞా×=) ప్రక్రియను ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి సరైన ప్రక్రియ పాటించకుండా పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆయన తన పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. ఒవైసీ తరఫున న్యాయవాది నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపించారు. ఈ అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి తమ పిటిషన్‌ను కూడా గురువారం విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. ఈ అభ్యర్థనను పరిశీలిస్తామని, సంబంధిత కేసులతో కలిపి విచారణ జాబితాలో చేర్చే అంశాన్ని చూస్తామని సీజేఐ తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తక్షణమే స్టే విధించాలని ఒవైసీ తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ఫారం-6 దరఖాస్తులకు సంబంధించి మ్యాపింగ్ వంటి నిబంధనలు ఓటర్లకు భారంగా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఇదే అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒవైసీ పిటిషన్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పిటిషన్లన్నింటినీ కలిపి సుప్రీంకోర్టు రేపు విచారించనుంది.

## కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఉగ్రరూపం

మొదటిపేజీ తరువాయి - నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు. బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. "పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

### యూకే మేయర్లతో సీఎం భేటీ

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా "యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్" అనే అంశంపై యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026"కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

## షార్జాలో భారతీయుడికి జాక్‌పాట్.. లాటరీలో రూ. 13 కోట్లు!

మొదటిపేజీ తరువాయి - యూఏఈలోని షార్జాలో నివసిస్తున్న కిషోర్ అనే ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. ఆయన ఏకంగా 5 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 13 కోట్లు) లాటరీ గెలుచుకున్నారు. యూఏఈ లాటరీలో రెండో బహుమతిని ఆయన సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 3న యూఏఈ లాటరీ నిర్వాహకులు డ్రా తీశారు. ఈ డ్రాలో కిషోర్ కొనుగోలు చేసిన టికెట్‌కు రెండో బహుమతి దక్కింది. ఆయన అధికారిక వెబ్‌సైట్ ద్వారా 50 దిర్హమ్‌లు (సుమారు రూ. 1300) వెచ్చించి ఈ టికెట్‌ను కొనుగోలు చేశారు. లాటరీ ఫలితాలు వెలువడిన తర్వాత, విజేతల జాబితాలో తన పేరు చూసి మొదట నమ్మలేకపోయానని కిషోర్ తెలిపారు. ఆ తర్వాత తన వద్ద ఉన్న టికెట్ నంబర్‌తో సరిచూసుకుని, విజేతను తానేనని నిర్ధారించుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ లాటరీ డ్రాలో 30 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 78 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను ఎవరూ గెలుచుకోలేదని నిర్వాహకులు తెలిపారు. కిషోర్ లాటరీ గెలిచిన విషయాన్ని యూఏఈ లాటరీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఒక్క లాటరీ టికెట్‌తో రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన కిషోర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## ఎన్నికల ముందు ఇరాన్‌పై దాడి?.. ట్రంప్, నెతన్యాహు మధ్య రహస్య చర్చలు!



మొదటిపేజీ తరువాయి - ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్య చేపట్టే అంశంపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మధ్య గత వారం ఈ కీలక సంభాషణలు జరిగినట్లు పలువురు అధికారులు తెలిపారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలను కమ్ముకునేలా చేస్తోంది. ఇజ్రాయెల్ నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్ తన అణు కార్యక్రమానికి సంబంధించిన కొన్ని భాగాలను పునరుద్ధరించే ప్రయత్నాల్లో ఉందని నెతన్యాహు, ట్రంప్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పికాక్స్ మౌంటెన్' వంటి ప్రదేశాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక చర్యను పునఃప్రారంభించేందుకు నెతన్యాహు తీవ్ర ఆసక్తి చూపారని, దీనిపై ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ట్రంప్ ఆయనకు చెప్పినట్లు ఒక అమెరికా అధికారి పేర్కొన్నారు. అయితే, ట్రంప్ దీనిపై ఎటువంటి కచ్చితమైన హామీ ఇవ్వలేదని సమాచారం. మొదట ఈ ఆలోచనకు ట్రంప్ సానుకూలంగా ఉన్నప్పటికీ, తన సలహాదారులతో సంప్రదించిన తర్వాత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, సెంట్రల్ కమాండ్ నాయకత్వం సైనిక చర్యకు మొగ్గు చూపగా, ట్రంప్ సలహాదారుల్లో మెజారిటీ సభ్యులు మాత్రం ప్రస్తుతానికి ఆర్థిక ఆంక్షల ఒత్తిడిని కొనసాగించడమే మేలని సూచించినట్లు సమాచారం. అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేయబోమని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడానికి ముందే ఈ చర్చలు జరగడం గమనార్హం. ఈ పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్‌లో అక్టోబర్ 27న, అమెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఇలాంటి సమయంలో ఇరాన్‌పై భారీ సైనిక చర్యకు దిగితే, అది రెండు దేశాల ఎన్నికల్లోనూ ప్రధాన ప్రచారాంశంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల వైఖరిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే, ఈ వార్తలను వైట్‌హౌస్ ఖండించింది. మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై ఎటువంటి దాడి ఉండదని అధ్యక్షుడు స్పష్టం చేశారని, యుద్ధాన్ని పునరుద్ధరించే అంశంపై నేతలు చర్చించలేదని పేర్కొంది. మరోవైపు, నెతన్యాహు కార్యాలయం స్పందిస్తూ.. ట్రంప్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ధ్రువీకరించింది. కానీ, చర్చల సారాంశంపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించింది. ఏది ఏమైనప్పటికీ, భవిష్యత్తులో అధ్యక్షుడి నుంచి ఆదేశాలు వస్తే వెంటనే స్పందించేందుకు ఇజ్రాయెల్ సైన్యం, అమెరికా సెంట్రల్ కమాండ్ పూర్తిస్థాయిలో సన్నాహాలు పూర్తిచేసి అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా



కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు. కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## తెలంగాణను గ్లోబల్ పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి - తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన, 'తెలంగాణ రైజింగ్--2047' విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను వివరించారు. రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా సుమారు 5 శాతంగా ఉందని, దానిని 10 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

### CURE, PURE, RARE ప్రాంతాల అభివృద్ధి

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణను మూడు ప్రధాన ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని రేవంత్ రెడ్డి వివరించారు.

జఖ=జు:లి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాన్ని ఐటీ, సేవారంగం, అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు.

౯ఖ=జు:లి ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యనున్న ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

=ూ=జు:లి గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచనున్నారు.

### పెట్టుబడిదారులకు పూర్తి భరోసా

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అవసరమైన సహకారం, రక్షణ కల్పిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేస్తామని తెలిపారు. స్థానిక పారిశ్రామికవేత్తలు కూడా నూతన పారిశ్రామిక విధానంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటివరకు చాలామంది స్థానిక పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు సేవలు అందించే రంగాలపై దృష్టి సారించారని పేర్కొంటూ, ఇకపై మన ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్తలు స్వయంగా పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



### అభివృద్ధే ప్రధాన ఎజెండా

2047 నాటికి భారత్ స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తిచేసుకోనుందని సీఎం గుర్తుచేశారు. అప్పటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్--2047' లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్రాల సహకారం కీలకమని అన్నారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమే ఉండాలని, మిగతా సమయంలో అభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని అభిప్రాయపడ్డారు. సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన చార్మినార్ హైదరాబాద్‌కు గుర్తింపుగా నిలిచిందని, అనంతరం హైటెక్ సిటీ ప్రపంచ పెట్టుబడులకు మరో కీలక కేంద్రంగా అవతరించిందని సీఎం పేర్కొన్నారు. ఇదే తరహాలో తెలంగాణను మరింత అభివృద్ధి చేసి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

### మహిళా సాధికారతకు ప్రాధాన్యం

మహిళల ఆర్థిక స్వావలంబనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళలకు రూ.61,000 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని పేర్కొన్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల యజమానులుగా, పెట్రోల్ బంకుల నిర్వహకులుగా, సౌర విద్యుత్ ప్లాంట్లలో భాగస్వాములుగా ఎదిగేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు మహిళలు, యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలని సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు.

### యువతకు స్ఫూర్తిగా విజయగాథలు

పూర్వం వస్తు మార్పిడి విధానం నుంచి నేటి ఆధునిక వ్యాపార పద్ధతుల వరకు వాణిజ్య రంగం అనేక మార్పులకు లోనైందని సీఎం పేర్కొన్నారు. ఈ మార్పులను అర్థం చేసుకుంటూ కొత్త వ్యాపార విధానాలను అనుసరించడంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు సినీ, రాజకీయ రంగాల్లో వివిధ స్థాయుల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకున్నారని సీఎం ప్రస్తావించారు. ఇలాంటి విజయగాథలను నమోదు చేసి, భవిష్యత్ తరాలకు అందించాలని ఛాంబర్ ప్రతినిధులకు సూచించారు. కొత్త తరం అభివృద్ధికి, పారిశ్రామిక రంగ విస్తరణకు వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించిన నిర్వాహకులను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాల సాధనలో ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు, స్థానిక వ్యాపారులు, మహిళలు, యువత కలిసి ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు.

## జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం



మొదటిపేజీ తరువాయి - మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.

## తీహార్ జైలుకు వెళ్లిన సీజేపీ నేతలకు బాసటగా రాహుల్ గాంధీ



మొదటిపేజీ తరువాయి - అరెస్టయి, శాంతి ఒప్పందం (పీస్ బాండ్)పై సంతకం చేసి విడుదలైన వీరు... ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించినందున కస్టడీకి పంపినట్లు పోలీసులు తెలిపారు. వీరితో పాటు అరెస్టయిన అజింక్యా షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. ఈ అరెస్టులపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "జంతర్ మంతర్ భారత ప్రజలది. దానిని మేం తిరిగి స్వాధీనం చేసుకుంటాం. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి.. అందరిదీ ఒకే లక్ష్యం. అదే పౌరుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ" అని పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు అరవింద్ కేజ్రీవాల్, ఎంకే స్టాలిన్, అభిషేక్ బెనర్జీ, ఆదిత్య ఠాకరే వంటి పలువురు విపక్ష నేతలు కూడా ఈ అరెస్టులను ఖండించారు. తమకు మద్దతు ప్రకటించినందుకు రాహుల్ గాంధీకి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు.

## ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు

రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

తెలుగు దినపత్రిక
వార్త నిర్భయం
సామాన్యుడి చేతిలో సామాజిక అస్త్రం!
www.vaarhtanirbhayam.com



# ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల పై ద్వంద వైఖరి అవలంబిస్తున్న కాప్రా రెవెన్యూ సిబ్బంది

కాప్రా ఎంఆర్ఓ మతిన్ హెచ్చరిక నామ మాత్రమే..

జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాల పై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన స్పందన కరువైంది..

అన్ని ఫిర్యాదులకు స్పందించరా.. అందులో మీ ఇష్టం ఉన్నయే కూల్చి వేస్తారా కొన్ని కూల్చుడెందుకు కొన్ని ఆపుడేందుకు..



జవహర్ నగర్ అక్టోబర్ 15 (వార్త నిర్భయం) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా మండలం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా మండల తహసీల్దార్ మతిన్ హెచ్చరించారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం జవహర్‌నగర్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో కూల్చివేశారు. బాలాజీ నగర్ లోని మోహన్ రావు నగర్ కాలనీలోని భారీ షెడ్డు మరియు రేణుక నగర్ కాలనీలోని అక్రమ నిర్మాణాన్ని కాప్రా రెవెన్యూ సిబ్బందికి ఇవి కనబడలేదా వీటి పైన ఎలాంటి ఫిర్యాదు రాలేదా మరి ఎందుకు వీటిని చూసి చూడనట్టు వదిలేశారు. దీని ద్వారా ద్వంద వైఖరి అవలంబించకుండా అందరు విషయంలో ఒక విధమైన న్యాయం జరగాలని బాధితులు సమీపంలోని ప్రజలు రెవెన్యూ సిబ్బందిని వేడుకుంటున్నారు . జవహర్‌నగర్‌లోని సంతోష్‌నగర్, చెన్నాపూర్, రాజీవ్‌గాంధీనగర్, కేసీఆర్‌నగర్ ప్రాంతాల్లో ఈ కూల్చివేతలు చేపట్టారు. గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో రెవెన్యూ సిబ్బంది ఈ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేని నిర్మాణాలు చేపట్టినా సహించేది లేదని స్పష్టం చేశారు.ప్రభుత్వ భూములను పేదలకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అటువంటి వారిని గుర్తించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రభుత్వ భూములను పరిరక్షించడమే తమ లక్ష్యమని, ప్రజలు ప్రభుత్వ భూముల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

అదనపు కలెక్టర్లు



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** వెట్టి చాకిరీ నిర్మూలన, బలవంతపు శ్రమ నుంచి కార్మికులకు విముక్తి కల్పించడం, కార్మికుల హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని బుధవారం వనపర్తి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ, వెట్టి చాకిరీ, బలవంతపు శ్రమ అనేవి కార్మికుల స్వేచ్ఛను, హక్కులను హరించే చర్యలని పేర్కొన్నారు. వివిధ అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు వెట్టి చాకిరీ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అప్పులు ఇచ్చిన వ్యక్తులు లేదా రుణదాతలు బెదిరింపులకు పాల్పడటం, అప్పుల పేరుతో కార్మికులను బలవంతంగా పనిచేయించడం వంటి చర్యలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. వెట్టి చాకిరీకి గురైన వారు, అలాంటి పరిస్థితులను గమనించిన వారు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ టి. వినోద్ కుమార్ మాట్లాడుతూ, వెట్టి చాకిరీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ఈ స్వేచ్ఛా రథం జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించనుందని తెలిపారు. ప్రచార వాహనం ద్వారా పాటలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం, కార్మికుల హక్కులు, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ సేవల గురించి వివరిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో ఈ ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పనిచేసే చోట జీతం ఇవ్వకపోయినా, పని వదిలి వెళ్లనివ్వకపోయినా, బెదిరింపులకు గురిచేస్తే అధికారులకు ఫిర్యాదు చేయడంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.బలవంతపు శ్రమ దోపిడీపై ఫిర్యాదులు లేదా సహాయం కోసం 080-69434343 హెల్ప్ లైన్ నంబర్ కు ఫోన్ చేయాలని అదనపు కలెక్టర్లు ప్రజలకు సూచించారు. వెట్టి చాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, ఇన్ చార్జి కార్మిక అధికారి వేణుగోపాల్, సంబంధిత అధికారులు, స్వేచ్ఛా రథం బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు రంగారెడ్డి పంపులు ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఫలించిన సింగిరెడ్డి వ్యూహం



**వనపర్తి బ్యూరో , అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పోరాటం ఫలించింది. కొన్ని నెలలుగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులు ప్రారంభించాలని, నార్లాపూర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు అనుసంధానం చేసి ఎల్ నినో ఇబ్బందులు తొలగించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. పాలమూరు రంగారెడ్డి పంపులు ప్రారంభించకుంటే కేటీఆర్ తో కలిసి నార్లాపూర్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. దీంతో గత కొన్ని రోజులుగా పంపులు ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతూ వస్తోంది.తాజాగా నిన్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి నార్లాపూర్ ను సందర్శించి పంపులు ఆన్ చేస్తారా? లేక రైతులతో కలిసి ఆన్ చేయాలా? అని హెచ్చరించారు. దీంతో బుధవారం మొద్దు నిద్ర వీడి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులు కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్ చేసింది. నార్లాపూర్ రిజర్వాయర్ లో 6.5 టీఎంసీల నీరు నిండేంత వరకు పంపులు ఆపొద్దని ఒక ప్రకటనలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎస్ఐఆర్ రద్దు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్




**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** ఎస్ఐఆర్ ను రద్దు చేయాలని, ఓటర్ల తొలగింపు నిబంధనలను సవరించాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వనపర్తి అంబేద్కర్ చౌక్ లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను వారు ఖండించారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష ఆధ్వర్యంలో పనిచేసే ఢిల్లీ పోలీసులు నగరం మొత్తాన్ని దుర్గంగా మార్చి జంతర్ మంతర్ వద్దకు వచ్చిన వారిని అదుపులోకి తీసుకున్నారని వారు ఆరోపించారు. జంతర్ మంతర్ వద్ద సమావేశాలకు అనుమతి నిరాకరించడం ద్వారా రాజ్యాంగం హామీ ఇచ్చిన నిరసన హక్కును అణచివేస్తున్నారన్నారు. అయినప్పటికీ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి, యువజన సంస్థల నాయకత్వంలో వందలాది మంది యువకులు పోలీసుల బారికేడ్లను ధిక్కరించి నిరసన తెలిపారని, వారిని పోలీసులు దారుణంగా హింసించి బస్సుల్లోకి తోశారని ఆరోపించారు.సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, బృందా కరత్, డీవైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి హిమగ్నరాజ్ భట్టాచార్య, ఎంపీ ఏఏ రహీం, ఎస్ఎఫ్ఐ నాయకులు సృజన్ భట్టాచార్య, ఆదర్శ్ సాజి, ఐషే ఘోష్ లను అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు. అలాగే సీపీఎం రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిటాస్ పై దాడిని కూడా ఖండించారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు నిబంధనలను సవరించే వరకు, ఎస్ఐఆర్ రద్దు చేసి తొలగించిన 13 కోట్ల ఓట్లను తిరిగి ఇచ్చే డి బాల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు, పరమేశ్వర చారి, గుంటి వెంకటయ్య, బాల్య నాయక్, వెంకట్ రాములు, ఆర్ ఎన్ రమేష్, నాయకులు గంధం భగత్, గంధం గట్టయ్య, ఏ కృష్ణయ్య, డి వెంకటయ్య, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలకు పోచారంలో ఘనంగా ఏర్పాట్లు

చెరువు కట్ట, బతుకమ్మ మెట్ల వద్ద శుభ్రత పనులు చేపట్టిన గ్రామస్తులు



**ఎడపల్లి మండలం అక్టోబర్ 14 (వార్త నిర్భయం ):** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం పోచారం గ్రామంలో గురువారం నిర్వహించనున్న బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామంలో పండుగ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ నీరడి జ్యోతి రవికుమార్, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని చెరువు కట్టతో పాటు బతుకమ్మలను నిమజ్జనం చేసే మెట్ల పరిసర ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టారు. బతుకమ్మ పండుగకు మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో చెరువు కట్ట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామ పెద్దలు, అభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు ముందుకు వచ్చారు. పండుగకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జక్కు రాజ్ కుమార్, కోశాధికారి సుంకరి సుదర్శన్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కమ్మరి భూమేష్ గోవింద్ రెడ్డి జంగం రాజయ్య,, భజనోళ్ల గంగారం, కట్ట సుధాకర్, గైని సుధాకర్ తో పాటు గ్రామ యువకులు పాల్గొన్నారు.గ్రామ సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించేందుకు గ్రామస్తులు సమిష్టిగా కృషి చేస్తున్నారు.బతుకమ్మ వేడుకలకు పోచారంలో ఘనంగా ఏర్పాట్లు

# నేనెప్పుడూ పాలకుడిని కాదు ప్రజా సేవకుడినే!

గెలిచిన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటున్నా.. ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం: ఎమ్మెల్యే నాయిని..

రూ.20 లక్షలతో దీన్‌దయాళ్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** నేనెప్పుడూ పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడినే. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నా. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు క్యాంపు కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ ,50 వ డివిజన్ పరిధిలోని దీన్‌దయాళ్ నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. శాయంపేట డివిజన్‌లో గత మూడేళ్లుగా అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పూర్తిస్థాయి గ్రామీణ వాతావరణం కలిగిన శాయంపేట డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో శాయంపేట పరిధిలోని కొన్ని కాలనీలకు ఎమ్మెల్యేలు సైతం పర్యటించని పరిస్థితి ఉండేదని, తాను గెలిచిన నాటి నుంచి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు. ఇప్పటికే పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు , డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని వివరించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందేలా కృషి చేశామని తెలిపారు. ఇంకా ఇళ్లు మంజూరు కావాల్సిన అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రానున్న రోజుల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి పలు స్థానిక సమస్యలను తీసుకువచ్చారు. వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే, మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ మార్క విజయ్,మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు,నెక్కొండ కవిత కిషన్,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,మాజీ అధ్యక్షులు సురేందర్ ,స్థానిక కాలనీ నాయకులు అశోక్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌లో ఐలమ్మ విగ్రహ ధ్వంసం ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

రజక సంఘం జిల్లా నాయకులు ఘనపురం విజయ్



వనపర్తి బ్యూరో అక్టోబర్ 14 (వార్త నిర్భయం) మెదక్‌లో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని రజక సంఘం జిల్లా నాయకులు ఘనపురం విజయ్ అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ మాట్లాడుతూ, తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన చోటే తిరిగి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలకు రక్షణ లేకుండా పోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విగ్రహ ధ్వంసం ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి నిందితులను గుర్తించి, అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే స్పందించాలన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాల ధ్వంసం ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనలు, పోరాటాలు చేపడతామని విజయ్ హెచ్చరించారు.

# గారపాటి మురళీకృష్ణ కుమారుడి నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న రంపచోడవరం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ నాగులపల్లి ధనలక్ష్మి



**రాజవొమ్మంగి అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ ప్రెసిడెంట్ శ్రీ గారపాటి మురళీకృష్ణ కుమారుడికి మరియు రాజవొమ్మంగి మండలం జడ్డంగి మాజీ సర్పంచ్ శ్రీ కొంగర మురళీకృష్ణ అక్కయ్య కుమార్తెకి జడ్డంగిలో జరుగుతున్న నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న రంపచోడవరం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ సింగిరెడ్డి రామకృష్ణ మాజీ కోఆప్షన్ నెంబర్ అడపా కామేష్ , సింగిరెడ్డి రవి గడవకుర్తి మాజీ సర్పంచ్ చందు జిల్లా ఉపాధ్యక్షులు కందుల బాబ్జి , రంపచోడవరం మండలం పార్టీ ప్రెసిడెంట్ జల్లేపల్లి రామన్న దొర దేవీపట్నం మాజీ ఎంపీపీ కుంజం మురళి ,కట్ట సత్తిబాబు సిరసం పెద్దబ్బి పోలిశెట్టి రామకృష్ణ కాల్ చర్ల బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

# మంగంపల్లి నిందితులను 48 గంటల్లో అరెస్టు చేయాలి

లేదా వనపర్తి జిల్లాను దిగ్బంధం చేస్తాం.

మాదిగ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షులు వాడల కురుమన్న



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో దళిత యువకుడిని కులం పేరుతో దూషించిన నిందితులను 48 గంటల్లో అరెస్టు చేయకపోతే వనపర్తి జిల్లాను దిగ్బంధం చేస్తామని మాదిగ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షులు వాడల కురుమన్న హెచ్చరించారు.అక్టోబర్ 12న ఉదయం 11 గంటలకు మంగంపల్లి గ్రామానికి చెందిన మాదిగ యువకుడు సుధీర్ ఆ గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రవేశానికి వెళ్తున్న తరుణంలో స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మేనమామ వెంకట్ రామ్ రెడ్డి, శ్రీనివాస్ ెగంటల్లో అరెస్టు చేయాలని, లేనియెడల వనపర్తి పట్టణ కేంద్రాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

# మదన్‌పల్లిలో ఘనంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు.. చండీ హోమం



**మక్లూర్ మండలం , అక్టోబర్ 14 (వార్త నిర్భయం):** నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. 17వ వార్షికోత్సవ వేడుకలు భక్తుల సందడితో వైభవంగా జరిగాయి.

# రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 14 (వార్త నిర్భయం )** ఐనవోలు మండలంలోని వెంకటాపురం, కడిపికొండ, కుమ్మరిగూడెం పరిసర ప్రాంతాల్లో రైతులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, పంటలకు అందుతున్న సాగునీటి సరఫరాపై ఆరా తీశారు. పంటలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, రైత ులకు దఫాల వారీగా సాగునీరు అందించాలని ఆదేశించారు. సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం కావాలంటే పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రైతులకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు భరోసా ఇచ్చారు.

# దళితుల ఓట్లు కావాలి గుడిలోకి మాత్రం రావొద్దా

ఎమ్మెల్యే సొంతూరిలోనే దళితులకు అవమానమా

మంగంపల్లి ఘటనపై అఖిలపక్ష ఐక్యవేదిక ఆగ్రహం



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** దళితుల ఓట్లు కావాలి.. కానీ వారు గుడిలోకి మాత్రం రావొద్దా? ప్రజాస్వామ్యంలో ఇలాంటి వివక్షకు చోటెక్కడుందని అఖిలపక్ష ఐక్యవేదిక ప్రశ్నించింది. ఎమ్మెల్యే సొంతూరిలోనే, ఎమ్మెల్యే మామ దళితుల ఆలయ ప్రవేశానికి అడ్డుపడుతున్నారనే ఆరోపణలు వస్తే సామాన్య ప్రజలకు ఎలాంటి సందేశం వెళ్తుందని నిలదీసింది. మంగంపల్లిలో చోటుచేసుకున్న ఘటనను ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై స్పందించిన అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ, ఇటీవల మంగంపల్లిలో జరిగిన ఘటనకు సంబంధించి గ్రామానికి వెళ్లి దళితులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ఇది ఒక్కరోజు జరిగిన ఘటన కాదని, గత 40 ఏళ్లుగా గ్రామంలోని దళితులకు ఆలయంలోకి ప్రవేశించే అవకాశం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయంలోకి వెళ్లకుండా బయటే ఉండి మొక్కుకోవాలంటూ చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఓట్ల కోసం దళితులు.. ఆలయ ప్రవేశానికి మాత్రం అడ్డంకులా? అని నిలదీసిన ఆయన, నేటికీ దళితులను అంటరానివారిగా చూసే ధోరణి కొనసాగుతుండటం బాధాకరమన్నారు. ఇలాంటి వివక్షాపూరిత చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. మంగంపల్లి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను డాక్టర్ సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు అడ్డుకట్ట వేయాలని, గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో, గంధం నాగరాజు, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, బీజేపీ రవి, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాజవొమ్మంగిలో కొలువై ఉన్న శ్రీ నూకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన

మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



**రాజవొమ్మంగి అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం రాజవొమ్మంగి మండలం రాజవొమ్మంగిలో కొలువై ఉన్న శ్రీ నూకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన గౌరవ మాజీ ఎమ్మెల్యే మరియు రంపచోడవరం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ సింగిరెడ్డి రామకృష్ణ మాజీ ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ,జడ్డంగి మాజీ సర్పంచ్ మరియు రాష్ట్ర విభజన విభాగ జాయింట్ సెక్రటరీ కొంగర మురళి మాజీ కో ఆప్షన్ నెంబర్ అడపా కామేష్ , సింగిరెడ్డి రవి , మండల యూత్ ప్రెసిడెంట్ కుశరాజు ,మాజీ ఎంపీటీసీ కనిగిరి దేవి వీరబాబు ,పంచాయతీ విభాగం అధ్యక్షులు కనిగిరి దుర్గ ప్రసాద్ ,రంపచోడవరం మండలం పార్టీ ప్రెసిడెంట్ జల్లేపల్లి రామన్న దొర , దేవిపట్నం మాజీ ఎంపీపీ కుంజం మురళి పోలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంగంపల్లి ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

నిందితులపై చర్యలకు ఎస్పీకి ఆదేశం.

దళితులతో అన్నదమ్ముల్లా ఉంటాం

దళిత యువకుడి పట్ల దురుసు ప్రవర్తనపై ఆగ్రహం.



**వనపర్తి, అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** పెద్దమందడి మండలం మంగంపల్లిలో దళిత యువకుడు సుదీర్ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి వచ్చినందుకు కొందరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించిన ఘటనపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైందని, దర్యాప్తు చేసి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన సొంత గ్రామమైన మంగంపల్లితో సహా నియోజకవర్గం మొత్తంలో తామంతా కలిసిమెలిసి ఉంటామని, కొందరు కావాలనే దీనిని రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు గత ప్రభుత్వ హయాంలో నాయకులు దళితుల ఇళ్లలో భోజనం చేసిన దాఖలాలు లేవని, తాను మాత్రం ఎన్నోసార్లు దళితుల ఇళ్లలో భోజనం చేశానని, వారితో అన్నదమ్ముల్లా, కుటుంబ సభ్యుల్లా కలిసి ఉంటామని, సుదీర్ కుటుంబంతో తమకు ఎలాంటి భేదాలు లేవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

తెలుగు దినపత్రిక
వార్త నిర్భయం
సామాన్యుడి చేతిలో సామాజిక అస్త్రం!
www.vaarhtanirbhayam.com



# సిద్దిపేట అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్ బీజేపీ



**బీఆర్ఎస్వీ నేత మొకిల్ల శ్రీకాంత్ రెడ్డి**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** సిద్దిపేట జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తే చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర యువ నాయకులు మొకిల్ల శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. రాఘవపూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా నేడు కేసీఆర్, హరీష్ రావు కృషితో దేశానికే ఆదర్శవంతమైన జిల్లాగా కొనసాగుతోందన్నారు. జిల్లా ప్రజలు అన్ని వర్గాలు స్వచ్ఛందంగా, రాజకీయాలకు అతీతంగా వచ్చి సంబరాలు చేసుకుంటే కడుపు మంటతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని, విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, అగ్రికల్చర్ కాలేజీ, బీఎస్సీ నర్సింగ్ కాలేజీ, ఐటీ టవర్, కరెంటు ఎస్ఈ ఆఫీసు, గ్రంథాలయం, ఉచిత శిక్షణ కేంద్రాన్ని తీసుకువచ్చిన ఘనత హరీష్ రావుదేనని అన్నారు. 20 కోట్లు ఖర్చుపెట్టి దశాబ్ది ఉత్సవాలు చేశారని అసత్య ప్రచారం చేస్తున్నారని, సోయి తెచ్చుకుని మాట్లాడాలని హితవు పలికారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే మూడేళ్లుగా ఆగిపోయిన అభివృద్ధి పనుల గురించి మాట్లాడాలన్నారు. 10 శాతం పనులతో ఆగిపోయిన 1000 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రద్దు చేసిన వెటర్నరీ కళాశాల గురించి మాట్లాడటానికి నోరు మూసుకుపోయిందా అని ప్రశ్నించారు. కోమటి చెరువు పక్కన హరీష్ రావు ప్రారంభించిన శిల్పారామాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ఆపిందని, దానికి నిధులు మంజూరు చేసి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు పిట్ల రాకేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గ్యార మహేష్, రూరల్ మండల నాయకులు పాపగారి శ్రీకాంత్, దేశ్పాండే విక్రమ్ రావు, పంది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకవైపు గోదావరి నీళ్ళు రావడం లేదు మరోవైపు గోదావరి నీళ్ళకు సంఖుస్థాపనలు

**కోరుకొండ అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** మెదటిదానికి మెగుడు లేదు కానీ రెండో దానికి కూటమి పెళ్లి ముహూర్తాలు పెట్టినట్టు ఉంది రాజానగరం నియోజకవర్గంలో అధికారులు, నాయకుల తీరు. గత నెలన్నర నుండి గోదావరి నీళ్ల కోసం ఎదురుచూస్తున్న చుక్క మంచి నీరు రాకున్నా పట్టించుకోకుండా రానున్న రోజుల్లో గోదాదరి నీళ్ల అందించే లక్ష్యంతో నియోజకవర్గంలో జల జీవన్ మిషన్ అమరజీవి జలధార ద్వారా రూ.473 కోట్లతో ప్రజలకు మంచినీళ్ల అందించడానికి బుధవారం సంఖుస్థాపనలు చేయడం చర్చనీయాంశమైంది.





రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు కొండపైన ఉన్న ట్యాంకుల్లోకి గోదావరిలో నీటిని పంపింగ్ చేసిన తర్వాత పైపులైన్ల ద్వారా నామవరం, పుణ్యక్షేత్రం, వెలుగుబొంద, చక్రద్వారబంధం, ఫరిజిల్లిపేట, రాజానగరం, పాలచర్ల గ్రామాలకు సరఫరా జరుగుతుంది. బొమ్మూరులో హెడ్వర్క్స్ యంత్రాల సమస్యలు, గోదావరిలో తగినంత నీళ్ల లేకవపోవడం వలన నీటి సరఫరా నెల న్నర రోజుల నుండి ఆగిపోయింది. దీంతో ప్రజలు మంచినీ 00 గ్రామాల్లో ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లు నుండి కొనుక్కుని తాగుతున్నారు. ప్రజలు గోదావరి నీళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నా అధికారులు ప్రత్యమ్నయ ఏర్పాట్లు చేయలేదు, పట్టించుకోలేదు. ఈ నేపథ్యం జల జీవన్ మిషన్ అమరజీవి జలధార ద్వారా బస్టాండ్ రాజానగరంలో రూ.194 కోట్లు, కోరుకొండలో రూ.279 కోట్లుతో గోదావరి నుండి మంచినీళ్ల అందించడానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, నాయకులు సంఖుస్థాపనలు చేశారు. దీని ద్వారా మండలంలో శ్రీరాపురంలో డి.హెచ్.బి.ర్ ఏర్పాటు చేసి రాజమహేందవరం రూరల్ మండలంలో పిడుంగొయ్య, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, దివాన్ చెరువు, కొత్తతుంగపాడు, పాతుతుంగపాడు, ముక్కినాడ, శ్రీకృష్ణపట్నం, పాలచర్ల, చక్రద్వారబంధంలో డి.హెచ్.బి.ఆర్ ద్వారా ఫరిజిల్లిపేట, ముక్కినాడ, నామవరం, పల్లకడియం, రామస్వామిపేట, కలవచర్ల, సందరాడ, నరేంద్రపురం, చక్రద్వారబంధం, రాజానగరం, సీతారాంపురం, వెలుగుబొందతోపాట సీతానగరం, కోరుకొండ మండలాల్లో గ్రామాలకు మంచినీళ్ల అంది చాలనే 00 లక్ష్యంగా సంఖుస్థాపనలు చేశా నియోజకవర్గంలో ప్రజలకు రక్షత గోదా' జలాలు అందించడానికి కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే బత్తల, జిల్లా అధ్యక్షుడు బొడ్డు తెలిపారు. అయితే నెలన్నర జిల్లా అధ్యక్షుడు బొడ్డు తెలిపారు. అయితే నెలన్నర రోజులుగా గోదావరి నీళ్ల రాకపాయినా అధికారులు, నాయకులు పట్టించుకోలేదు కానీ కొత్తగా గోదావరి నీళ్ల కోసం సంఖుసాపనలు ఏమేరకు ఉపయోగపడుతుంది వేచి చూడాలి

# లిరీ-సర్వేపై అపోహలు వీడి ప్రజలు సహకరించాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి అక్టోబర్ 14 (వార్త నిర్భయం )** పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన భూముల రీ-సర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని, రీ-సర్వేపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీ-సర్వే ప్రక్రియ ద్వారా భూముల సరిహద్దులు, విస్తీర్ణం, భూ రికార్డుల కోసం వివరాల్లో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని తెలిపారు. రీ-సర్వేపై ఎలాంటి అపోహలకు గురికాకుండా రైతులు, భూ యజమానులు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, రికార్డుల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసరావు, వరంగల్ ఆర్డీవో సుమ, పర్వతగిరి తహసిల్దార్ వెంకటస్వామి, గోపనపల్లి సర్పంచ్ నాంపల్లి విజయ, అనంతరం సర్పంచ్ తోట శ్రీలత, సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాలమూరు పంపులు ఆపకుండా నడపాలి.

# సిగ్గు లేదా అంటే నల్లగున్న నాకేం సిగ్గన్నట్లుంది మంత్రి జూపల్లి తీరు

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** నార్లాపూర్ లో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపుల ప్రారంభం సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పాలమూరు పంపులు ఆపకుండా నడపాలని, మంత్రి జూపల్లి తీరు సిగ్గు లేదా జీడిగింజా అంటే నల్లగున్న నాకేం సిగ్గు అన్నట్లుందని విమర్శించారు. మూడేళ్లుగా పాలమూరు రంగారెడ్డి పనులను పడావు పెట్టింది ఎవరు? బీఆర్ఎస్ పాలనలోనే పూర్తయిన కాలువల టెండర్లను రద్దు చేసింది ఎవరు? మూడేళ్లుగా కాలువలు తవ్వకుండా అడ్డుకున్నది ఎవర పనులు సాగకుండా కేసులు వేసింది కాంగ్రెస్ కాదా? అప్పుడు జూపల్లి బీఆర్ఎస్ లో ఉన్నది నిజం కాదా? మూడేళ్ల క్రితమే నార్లాపూర్ లో పంపును కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలంగాణ మొత్తానికి తెలుసునని, ఎల్ నినో వస్తుంది, కరువు తెస్తుంది అని తెలిసినా బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నా పంపులు ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నా గత రెండు నెలలుగా నార్లాపూర్ పంపులు ఎందుకు ప్రారంభించలేదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండు పంపులు నడిపి వట్టెం, కరివెన వరకు సాగునీరు తీసుకువెళ్లొచ్చని అన్నారు. పది పంపులు నడపాలంటే పెండింగ్ పనులు అడ్డంకి కావచ్చు కానీ, నార్లాపూర్, ఏదులలో రెండు పంపులు నడపడానికి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులు పూర్తి స్థాయిలో ఎందుకు నడపలేదని, శ్రీశైలం నీళ్లను ఏపీ ప్రభుత్వం 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పంకు తరలించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ముల్లుకర్ర పెట్టి కుచ్చితే కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి రావడం లేదని, బీఆర్ఎస్ హెచ్చరికల నేపథ్యంలోనే కాంగ్రెస్ కళ్లు తెరిచి మోటార్లు ఆన్ చేసిందన్నారు. ఇప్పటికైనా నార్లాపూర్ రిజర్వాయర్ పూర్తిగా నిండే వరకు మోటార్లు నడపాలని, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని, మూడేళ్లుగా పనులు నిలిపివేసినందుకు పాలమూరు రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాజానగరం ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ కృషికి లభించిన ఫలితం: రూ. 279 కోట్లతో రాజానగరం నియోజకవర్గానికి 'అమరజీవి జలధార' ప్రాజెక్టుకు శ్రీకారం



**కోరుకొండ అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** గోదావరి జలాలతో రాజానగరం నియోజకవర్గంలోని 93 ప్రాంతాల్లో ప్రతి ఇంటా దాహార్తి తీర్చడమే లక్ష్యం కోరుకొండ బస్టాండ్ వద్ద పండగ వాతావరణం -- బృహత్తర ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ , రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ మరియు అలుపెరగని కృషి ఫలితంగా రాజానగరం నియోజకవర్గానికి రూ. 279 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయి. ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన, సురక్షితమైన గోదావరి తాగునీటిని అందించాలనే సంకల్పంతో 'జల జీవన్ మిషన్' కింద మంజూరైన "అమరజీవి జలధార" బృహత్తర ప్రాజెక్టుకు కోరుకొండ బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రుడా చైర్మన్ శ్రీ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు ప్రాంతీయ తాగునీటి సమస్యపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రాజానగరం నియోజకవర్గం కోసం రూ. 279 కోట్ల నిధులను మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కీలక పాత్ర పోషించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాజానగరం నియోజకవర్గ పరిధిలోని 93 ప్రాంతాలు/ఆవాసాలకు సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా అందుతుంది. రాబోయే దశాబ్దాల జనాభా తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు మరియు ఇంటింటికీ ఉచిత కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, "పవిత్ర గోదావరి నది మన చెంతనే ఉన్నప్పటికీ దశాబ్దాలుగా పరిశుభ్రమైన తాగునీరు అందక ప్రజలు పడుతున్న ఇబ్బందులను నేను దగ్గర నుండి చూశాను. అందుకే ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం, ప్రత్యేక కృషి చేసి 'అమరజీవి జలధార' ప్రాజెక్టు కింద రూ. 279 కోట్లు మంజూరు చేయించడం జరిగింది. ఈ ప్రాజెక్టు ద్వారా మన రాజానగరం నియోజకవర్గంలోని 93 ప్రాంతాలకు తాగునీరు అందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడమైనది," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం (. ఆర్డబ్ల్యూఎస్) ఇంజనీరింగ్ అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా గ్రామ స్థాయి నుంచి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**కోరుకొండ అక్టోబర్ 14 ( వార్త నిర్భయం)** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ గారి ఆధ్వర్యంలో కోరుకొండ మండలం గాదరాడ గ్రామం లోని ఓం శివశక్తి పీటం -- శంబాలా నగరం కళ్యాణ మండపంలో "ఆత్మీయ సమావేశం" అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలకు సంబంధించి పార్టీ నియమించిన సమన్వయకర్తలు, నిర్వాహక దళ్, మరియు సపోర్టింగ్ టీమ్ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సమావేశ ప్రారంభంలో విచ్చేసిన నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులందరి సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసారు.. అనంతరం ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, కమిటీల బాధ్యతలు, పార్టీ కార్యాచరణపై సభ్యులకు దిశానిర్దేశం చేస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ... పార్టీ కోసం మొదటి నుంచి ప్రాణపణంగా, అంకితభావంతో పనిచేస్తున్న సామాన్య కార్యకర్తలను, సైనికులను పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ గుర్తించి తగిన గౌరవం ఇస్తారని స్పష్టం చేశారు. నియోజకవర్గాల్లో పార్టీ జెండా మోసి, నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ సరైన గుర్తింపు ఉంటుందన్నారు. కమిటీలలో స్థాయిలు మారవచ్చు కానీ, నిర్వహించాల్సిన బాధ్యతలు చాలా కీలకమైనవని తెలిపారు. పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఏ దిశానిర్దేశం చేసినా, దానిని తూచా తప్పకుండా పాటించడమే నాయకులుగా, కార్యకర్తలుగా మనందరి మొదటి ప్రాథమిక కర్తవ్యమని పేర్కొన్నారు. సమన్వయకర్తలు, నిర్వాహక దళ్ మరియు సపోర్టింగ్ టీమ్ సభ్యులు ఐక్యమత్యంగా గ్రామాల్లో పర్యటించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో స్థానికంగా ప్రజల్లో మంచి పేరుండి, సేవా దృక్పథం కలిగి, పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లగల సమర్థులైన వ్యక్తుల వివరాలను, సమగ్ర సమాచారాన్ని (డేటాను) సిద్ధం చేసి ఒక నివేదికలా తయారు చేసుకోవాలని సూచించారు. మనకిచ్చిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో ఎంత సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నామనే దానిపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, పార్టీకి మరియు ప్రజలకు సేవ చేసే విషయంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలని కోరారు. రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నాయకులు, సీనియర్లు, యువత మరియు మహిళా నేతలు అందరూ కలిసి ఒక టీమ్‌గా పనిచేయాలన్నారు. గ్రామ స్థాయిలో కూటమి బలపడితేనే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అట్టడుగు వర్గాల వరకు వేగంగా చేరుతాయని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘనవిజ సాధన కోసం ప్రణాళికాబద్ధంగా కష్టపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీ టి.వి. రామారావు సీనియర్ నాయకులు శ్రీ అత్తి సత్యనారాయణ వై శ్రీను గారు, శ్రీమతి ప్రియ సౌజన్య , శ్రీమతి గంటా స్వరూప దేవి శ్రీమతి దిరిసిన ఫాతిమా రాణి , మరియు జిల్లా అధ్యక్షులు, మంత్రి శ్రీ కందుల దుర్గేష్ సలహాల మేరకు ఈ కమిటీలన్నీ సమన్వయంతో పనిచేస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో వివిధ నియోజకవర్గాల నుంచి విచ్చేసిన ప్రజాప్రతినిధులు, నిర్వాహక దళ్ సభ్యులు, జనసేన నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.లి

# స్థానిక సంస్థల ఎన్నిక కార్య చరణ పై సమావేశం పార్టీ ఐడి కార్డులు పంపిణీలో: తోట నరసింహం



**గోకవరం: (వార్త నిర్ణయం )** స్థానిక సంస్థలఎన్నికల కార్యచరణ పై సమావేశం, పార్టీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన తోట నరసింహం. బుధవారం మండల కేంద్రమైన గోకవరం, కృష్ణుని పాలెం గ్రామాలలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాటి రాంబాబు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల గ్రామ కమిటీ వైసిపి ప్రెసిడెంట్లు బాడితబోయిన చిన్న, గోలి సింహాచలం అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల కార్యచరణ పై సమాసం నిర్వహించారు. ఈకార్యక్రమానికిముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు, మరియు జగ్గంపేట నియోజకవర్గం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం పాల్గొని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ కమిటీల నియమించబడిననాయకులు, కార్యకర్తలకు పార్టీ ఐడి కార్డులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర ఏళ్ల అయినా ఇప్పటికీ ఎన్నికల హామీ అమలుపై ఎటువంటి కదలిక లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు 1500, బీసీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని ప్రజలను నమ్మించి మోసం చేయడం వాస్తవం కాదని తోట నరసింహం ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలకు బుద్ధి చెప్పడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికి వెళ్లి గతప్రభుత్వంలో అమలు చేసిన పథకాలు గురించి చెబుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం నుండి అన్ని రకాల నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసుకుని ఐక్యతతో పార్టీ విజయానికి కృషి చేయాలి అన్నారు. పార్టీ ఐడి కార్డులు పొందిన ప్రతి నాయకుడు కార్యకర్తకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ వివిధ అనుబంధ కమిటీలలో బాధ్యతలు నిర్వహిస్తూ మరణించిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక సహాయం అందించే విధంగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, దాసరి చినబాబు,సుంకర రమణ, గుల్లా ఏడుకొండలు,సుంకర వీరబాబు,అక్షింతలరాజా,సమ్మెట మోహన్,నారాలశెట్టి నరసయ్య, సుమంగళి,అధికారి బుజ్జి, సింబోతుల శ్రీను,అడబాల వెంకటేశ్వరరావు, దంగేటి వెంకట రత్నం,పాటి అప్పలరాజు,సిహెచ్ శివ, బత్తుల శ్రీను,కొల్లం అర్జున్ రావు,విరచంద్రం, రాంబాబు,జలెంరాము,కమ్మెల.అచ్చిబాబు,కరుటూరి వీర్రాజు,వరుపుల సూరిబాబు,దివానం,తుర్రం సత్యవతి, అర్జుల వెంకటేశ్వరరావు, పత్తి రాజేష్,పొట్నూరి.ఆచారావు,సెర శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెంటకలాన్‌లో బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**కెనాల్ కట్టను శుభ్రం చేసిన గ్రామ పంచాయతీ పాలకవర్గం మరియు గ్రామ అభివృద్ధి కమిటీ**



**బోధన్ మండలం, అక్టోబర్ 14 (వార్త నిర్భయం):** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెంటకలాన్ గ్రామంలో బతుకమ్మ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టారు. గురువారం నిర్వహించనున్న బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గ్రామ సమీపంలోని కెనాల్ కట్టపై మొలిచిన పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలో బతుకమ్మ వేడుకలను మహిళలు, గ్రామస్తులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళావతి (నాగరాజు), ఉపసర్పంచ్ నాగేందర్, గ్రామ పెద్దలు సంజీవ్ కుమార్, రమణ, వార్డు సభ్యులు, ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు

# అడ్డతీగల మండల ఎల్లవరం గ్రామంలో ఘనంగా వైఎస్ఆర్సీపీ స్థానిక సంస్థల, విస్తృత స్థాయి సమావేశం



**అడ్డతీగల అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామంలో ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల మరియు విస్తృత స్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షులు శ్రీ మద్దాల వీర్రాజు గారి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గౌరవ మాజీ ఎమ్మెల్యే మరియు రంపచోడవరం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బినాగులపల్లి ధనలక్ష్మి బి హాజరై, స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ – రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చెబుతాయని, పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం వైఎస్ఆర్సీపీ ఐడెంటిటీ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విశాఖ సీఫుడ్ ప్రత్యేకతను ప్రపంచానికి చాటేలా స్టార్ చెఫ్ ఛాలెంజ్-2026

**సంబంధిత పోస్టర్ను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి**



**విశాఖపట్నం అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** విశాఖపట్నం తీర ప్రాంత ఆహార సంస్కృతి, స్థానిక సముద్ర ఆహార వంటకాలు, సంప్రదాయ రుచులను ప్రోత్సహిస్తూ నగరాన్ని ప్రామాణిక సీఫుడ్ అనుభవాలకు ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఫ్లేవర్స్ ఆఫ్ వైజాగ్-స్టార్ చెఫ్ ఛాలెంజ్-2026' కార్యక్రమ రెండో ఎడిషన్ పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి బుధవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (హెచ్ ఆర్ ఏ పి ), జిల్లా పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఏ ఎస్ హెచ్ ఏ ), తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ (సి ఎ టి ఎ ) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సాగర్ నగర్‌లోని సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ బీచ్ క్యాంపస్‌లో ఈ 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం జరగనుంది. ఇదిలా ఉండగా పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా టూరిజం అధికారిణి జె. మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్ ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, విశాఖపట్టణం.

# డ్రైవర్స్ కాలనీలో ఘనంగా భవానీల పడిపూజ కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంబాల శ్రీనివాసరావు, దంపతులు**

**దేవీ నవరాత్రి మహోత్సవాలు, భవానీల పడిపూజ కార్యక్రమానికి కంబాల రూ.5 లక్షలు విరాళం**



**గోకవరం అక్టోబర్ 14:(వార్త నిర్భయం )** గోకవరం డ్రైవర్స్ కాలనీలో మంగళవారం రాత్రి భవానీల పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పడిపూజ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దుర్గమ్మ అలయంలో అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్మించారు. తొలిత కంబాల శ్రీనివాసరావు దంపతులకు, భవానీలు, డ్రైవర్స్ కాలనీ ప్రజలు, మహిళలు హారతులు పట్టి, ఘన స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. అనంతరం కంబాల శ్రీనివాసరావు దంపతులు గణపతి పూజ నిర్వహించి, పడిపూజ కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. డ్రైవర్స్ కాలనీ దేవీ నవరాత్రి మహోత్సవాలు, భవానీల పడిపూజ కార్యక్రమాల నిర్వహణకు కంబాల శ్రీనివాసరావు రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవీ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం, ఐకమత్యం పెంపొందుతాయని అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం భవానీలు, భక్తులకు, తాంబూలాలు అందించారు. ఈ కార్యక్రమంలో భవానీలు, డ్రైవర్స్ కాలనీ ప్రజలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 14 (వార్త నిర్భయం)** భూ రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం గోపాల్ పేట మండలం చెన్నూరు, ఏదుల మండలం రేకులపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే రికార్డులను పరిశీలించడంతో పాటు, ఆధునిక రోవర్ యంత్రాల పనితీరును, భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న భూ రీ-సర్వే ద్వారా భూముల హద్దులపై స్పష్టత ఏర్పడి, భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గుతాయన్నారు. సర్వేకు ముందు భూ యజమానులకు, సరిహద్దు రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, వారి సమక్షంలోనే హద్దులు నిర్ధారించాలని సూచించారు. రికార్డుల నమోదులో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించిన తర్వాతే సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతుల సందేహాలు, అభ్యంతరాలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని, రైతులు సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు, గ్రామ పాలన అధికారులు, సర్వే సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.